విశాలాంధ్ర
గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమ గోదావరి

రైతులను ఆదుకోవాలి
సీపీఐ, బీకేఎంయూ డిమాండ్

విశాలాంధ్ర-ఏలూరు: అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పది రోజుల నుంచి జిల్లాలో అకాల వర్షాలు పడుతున్నాయని దీనివల్ల జిల్లాలో వరి, మొక్కజొన్న, మిర్చి, మామిడి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యం అని ప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జిల్లా యంత్రాంగం ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టి ఉంటే రైతులు నష్టపోయేవారు కాదని, ఇది ప్రకృతి వైపరీత్యం కాదని ప్రభుత్వ వైఫల్యమేనని విమర్శించారు. పండించిన పంటలు నష్టపోయి పొలాల్లో రైతులు నానా అవస్థలు పడుతుంటే నేటి వరకు ఒక్క వ్యవసాయ అధికారి కూడా వారి వైపు కన్నెత్తి చూడకపోవటం దారుణమన్నారు. రైతులను ఆదుకోవడం అంటే వ్యవసాయం గురించి అవగాహనలేని అధికారులను నియమించడం కాదని, రైతులకు అవసరమైన విపత్తు నివారణ చర్యలు చేపట్టడమని సూచించారు. ఎకరాకు రూ.25 వేలకు పైగా ఖర్చు చేసిన రైతులకు కౌలు అధిక భారం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పండించే పంట భూమి విస్తీర్ణం, రైతుల సంఖ్య పెరిగిందని చెప్పలేని ప్రభుత్వాలు రైతు సంక్షేమం కోసం మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. జిల్లాలో గోనె సంచులు సరఫరా లేని కారణంగా దీన్ని అవకాశంగా తీసుకున్న మిల్లు యజమానులు ధాన్యం కొనుగోలులో రైతుల నడ్డి విరుస్తున్నారని ఆరోపించారు. మిల్లర్లు రైతుల వద్ద నుండి బస్తాకు రూ.200 వసూలు చేస్తున్నారని ఆరోపించారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తడిసిన, మొలకెత్తిన, నూకగా మారిన ధాన్యాన్ని ఎటువంటి ఆంక్షలు లేకుండా కనీసం మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా యంత్రాంగం జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసి వరి, మొక్కజొన్న, మామిడి, మిర్చి రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నష్టపోయిన రైతాంగానికి న్యాయం జరిగే పోరాటాలు చేస్తామని వారు హెచ్చరించారు.

రైతుల సొమ్ము వెనక్కి ఇవ్వాలి

విశాలాంధ్ర-పాలకొల్లు: ధాన్యం రైతులను వైఎస్సార్సీపీ ప్రభుత్వం దోపిడీ చేస్తోందని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం పాలకొల్లు మండలం లంకలకోడేరులో రైతులను ఆయన పరామర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైస్ మిల్లర్ల ద్వారా, రైతుల నుండి దోచుకున్న సొమ్మును 72 గంటల్లో వెనక్కి ఇవ్వాలంటూ అధినేత చంద్రబాబు ప్రభుత్వానికి డెడ్ లైన్ ఇచ్చారన్నారు. రైతులకు న్యాయం చేయకపోతే మంగళ, బుధ, గురువారాల్లో తహసిల్దార్ కలెక్టరేట్ ఆఫీసులను ముట్టడిస్తామన్నారు. అందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేశామన్నారు.

కైకరంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు మండలం కైకరం జిల్లా పరిషత్ హైస్కూలు కు చెందిన 2002 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆదివారం కైకరం-అక్కుపల్లి గోకవరం రోడ్‌లో ఉన్న నాగ సూర్య కన్వెన్షన్ హాల్ లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు అప్పటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు గంధం వెంకట్రావు,గౌస్ లక్ష్మణరావులు ను పూర్వ విద్యార్థులు శాలువా కప్పి ఘనంగా సన్మానం చేశారు. అందరూ కలిసి భోజనాలు చేశారు.

అంబేద్కర్ ఆశయసాధనకు కృషి చేయాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయసాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. టి నరసాపురం ప్రధాన సెంటర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని శనివారం రాత్రి ఆయన ఆవిష్కరించారు. దళిత నాయకులు కాకర్ల సత్యం, సంతోష్ కుమార్, అంబేద్కర్ కమిటీ సభ్యులు మేడంకి సర్వేశ్వరరావు, చిన్నం అర్జున్ రావు, చిన్నం ప్రసాద్, బత్తుల నాగేంద్ర, శీలం ఇమ్మానుయేల్, సుధీర్, అశోక్, శామ్యూల్ రాజు పాల్గొన్నారు.

డిజిటల్ ఫోన్ యాప్ రద్దు చేయాలి

విశాలాంధ్ర-ముసునూరు: పని ప్రదేశంలో డిజిటల్ ఫోన్ యాప్ రద్దు చేయాలని ఏలూరు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పిల్లి రామకృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని ముసునూరు, చింతలవల్లి, చక్కపల్లి, గుడిపాడు, వలసపల్లి, లోపూడి, అక్కి రెడ్డి గూడెం గ్రామాల్లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకంలో పేదలకు అన్యాయం జరుగుతుందని డిజిటల్ యాప్ రద్దు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.270లు నుంచి రూ.600లు ఇవ్వాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. పిల్లి మురళీ, శిలారపు రాజశేఖర్, కంచర్ల శ్రీను, ఆంజనీయులు, లక్కపాము వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నష్టపరిహారం మాటేంటి?

విశాలాంధ్ర-ముసునూరు: వారం రోజులగా కురుస్తున్న భారీ వర్షాలతో అరటి, పొగాకు, మిర్చి, మొక్కజొన్న పంటలు నష్టపోగా ఆదివారం ముసునూరు మండలం ఉద్యానశాఖాధికారి హేమ మండలంలోని పలు గ్రామాల్లోని వర్షం వల్లన నష్టపోయిన పంటలను పరిశీలించారు. పంటలను వర్షం నుంచి ఎలా కాపాడుకోవాలో రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుండి నష్టపరిహారం అందించే విధంగా చర్యలు చేపట్టడం మాని పంటల్లో ఏలాంటి రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించడం హాస్యస్పదంగా ఉందన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

విశాలాంధ్ర-నిడమర్రు: పెద నింద్రకొలనులో ఉన్న శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2001-2002లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో 115 విద్యార్థులు హాజరు అయ్యి టీచర్స్ ని సన్మానించారు. దంగేటి సత్యనారాయణ, గంటశాల బాలాజీ, అల్లాడి భీము, అల్లాడి రాంబాబు, నంబూరి శివ కుమార్ ఈ కార్యక్రమాన్ని ఏర్పాట్లు చేయడం జరిగింది.

ఉపయోగపడేలా గోడౌన్ ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-కలిదిండి: అందరికీ ఉపయోగపడే విధంగా గోడౌన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని కోరుకొల్లులో రూ.27లక్షలతో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం గోడౌన్ కు శంకుస్థాపన చేశారు. ఎంపీపీ చందన. ఉమామహేశ్వరరావు, పిఎసిఎస్ చైర్మన్ అంకెం. నరసయ్య, ఉప సర్పంచ్ చెన్నం శెట్టి. నాగరాజు, ఎఎంసి వైస్ చైర్మన్ పాము. రవికుమార్, వైకాపా మండల పార్టీ అధ్యక్షుడు తిరుమాని. రమేష్, సిహెచ్. కోదండరామయ్య పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో వాసు

విశాలాంధ్ర-ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల వెంకన్నను ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ఏఈవో పతికి నటరాజ్ ఎమ్మెల్యేకు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు, వేదపండితులు వేద ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి ప్రసాదాలు, చిత్రపటాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు.

నేడు కలెక్టరేట్లో జిల్లా స్థాయి స్పందన

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం లోని గోదావరి సమావేశ మందిరంలో నేటి సోమవారం ఉదయం గం.10 నుంచి 'స్పందన' కార్యక్రమం యధావిధిగా నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని డివిజనల్, మండల, మున్సిపల్ కార్యాలయాలల్లోను 'స్పందన' కార్యక్రమం మే 8వ తేదీ సోమవారం ఉదయం గం.10 గంటల నుంచి యధావిధిగా నిర్వహించబడుతుందన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

విశాలాంధ్ర-ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి నిత్యాన్నదాన పథకానికి రూ.1.50 లక్షలు విరాళం లభించినట్లు ఏఈవో నటరాజ్ తెలిపారు. కలిదిండి కి చెందిన కళా మురళీకృష్ణ రూ.1,01,116/లు, తెనాలికి చెందిన కన్నిగంటి పావని రూ.50వేల విరాళాన్ని ఏఈవోకు అందజేశారు. ఆయన దాతలను అభినందించారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలి

విశాలాంధ్ర- భీమవరం: జిల్లాలో రైతులకు ఏటువంటి ఇబ్బందులు కలగ కుండా మండల ప్రత్యేక అధికారు లందరూ వారంపాటు మండలాల్లో ఉండి ధాన్యం కొనుగోలును పర్యవేక్షించాలని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి ఆదేశించారు. ఆదివారం మండల ప్రత్యేక అధికారులకు, మండల అధికారులకు జిల్లా కలెక్టరు ఆదేశాలు జారీ చేశారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు పర్యవేక్షించేందుకు సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి మండల ప్రత్యేక అధికారులు మండలంలో ఉండి రైసు మిల్లుల వద్దకు రైతుల ధాన్యం తెస్తున్నారా వేరే వారి ధాన్యం ఎవరైనా తెస్తున్నారా పర్యవే క్షించాలని కలెక్టరు ఆదేశించారు. మండలంలోని తాసిల్దార్, వ్యవసాయశాఖ అధికారి, ఎంపీడీవో కూడా మండలంలో ధాన్యం కొను గోలును పర్యవేక్షించాలని సూచించారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు సాఫీగా సాగే విధంగా చర్యలు చేపట్టాలని ఆమె ఆదేశించారు. ఏ సమస్య వచ్చిన వెంటనే స్పందించి ఆ సమస్యను తక్షణమే పరిష్కరించాలని మండలం ప్రత్యేక అధికారులకు మండల స్థాయి అధికారులను జిల్లా కలెక్టరు ఆదేశించారు.

మహిళా సంఘాల ఆధ్వర్యంలో నేడు ధర్నా

విశాలాంధ్ర-ఏలూరు: మహిళా సమస్యలు, నిత్యావసర ధరల నియంత్రణపై నేడు జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు మహిళా సంఘాలు పిలుపునిచ్చాయి. ఆదివారం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో మహిళా సమాఖ్య ఏలూరు ఏరియా ఆధ్వర్యంలో ఏరియా కార్యదర్శి అడ్డగర్ల లక్ష్మీ ఇందిర అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న విశ్రాంత జడ్జి అడబాల లక్ష్మి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సహజ వనరులను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతుందని విమర్శించారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్, ధరల పెరుగుదల కారణంగా రవాణా చార్జీలు పెరిగి నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుదల కారణంగా ప్రజల జీవితాలు దుర్భరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత సబ్సిడీలు రద్దు చేసిన కారణంగా గ్యాస్ ధర పెరిగి పేద ప్రజల జీవితాలు చిన్నా భిన్నం అయ్యాయన్నారు. మహిళలకు నిత్య అవసరమైన గ్యాస్ ధరను రూ. 500కే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఉప్పులూరి లక్ష్మి, భవాని, గొర్లి స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి త్యాగాలు యువతకు ఆదర్శం: మండల

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: అల్లూరి సీతారామ రాజు త్యాగాలు, ఆశయాలు యువతకు ఆదర్శమని సీపీఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు అన్నారు. అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతి సందర్భంగా తాడేపల్లిగూడెం బస్టాండ్ వద్ద ఉన్న సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రగతి శీల కార్మిక రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే మస్తాన్, దాట్ల జగన్నాధ రాజు, కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షులు మెరుపు జాన్‌రాజు, బి కృష్ణ, మేరీ, ఎస్ కె అల్లి పాల్గొన్నారు.

అల్లూరి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

విశాలాంధ్ర-భీమవరం: అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తిని, ఆయన జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సీతారాంప్రసాద్ పిలుపునిచ్చారు. అల్లూరి వర్ధంతిని భీమవరం రూరల్ కొత్తపూసలమర్రులో ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి నివాళులర్పించారు. ప్రజానాట్య మండలి జిల్లా నాయకులు తిరుమాని కామేశ్వరరావు, తిరుమాని చంటి రాజు, సీపీఐ నాయకులు నాగిడి జయసుందరరావు, తిరుమాని శ్రీరాము, తిరుమాని లక్ష్మినారాయణ, బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దంతులూరి వర్ధంతి

విశాలాంధ్ర-భీమ వరం: క్విట్ ఇండియా ఉద్యమంలో దంతులూరి నారాయణరాజు వీరోచిత పాత్ర వహిం చారని ఆయన స్ఫూర్తితో యువత ముందు కెళ్లాలని వక్తలు పిలుపునిచ్చారు. క్విట్ ఇండియా స్థూపం వద్ద శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో క్విట్ ఇండియా ఉద్యమ నాయకులు, డీఎన్నార్ విద్యా సంస్థల వ్యవస్థాపకులు దంతులూరి నారాయణరాజు వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి, వసుధ ఫౌండేషన్ కార్యదర్శి ఇందుకూరి ప్రసాద్ రాజు, రీడర్స్ ఫోరమ్ అధ్యక్షులు అరసవల్లి సుబ్రహ్మణ్యం, ఉండపల్లి రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయుడికి ప్రత్యేక అభిషేకం

విశాలాంధ్ర-పాలకొల్లు: స్థానిక పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి పురస్కరించుకుని ఆదివారం స్వామికి ప్రత్యేక అభిషేకం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ప్రధాన అర్చకులు రమణ స్వామి, రఘు స్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సమితి సభ్యులు పర్యవేక్షించారు.

అర్ధరాత్రి ఎస్పీ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-ఏలూరు క్రైమ్: నగరంలో రాత్రుళ్ళు ఎలాంటి అలజడులు లేకుండా చూడాలని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి పోలీస్ అధికారులను ఆదేశించారు. ఆమె శనివారం అర్ధరాత్రి ఏలూరు వన్‌టౌన్, ఏలూరు 3 టౌన్ పోలీస్ స్టేషన్ ప్రాంతాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఉదాసీనంగా గస్తీ నిర్వహించవద్దని, అనుమానితుల వివరాలను ఎప్పటికప్పుడు కంట్రోల్ రూమ్‌కు తెలపాలని ఎస్పీ ఆదేశించారు. నగరంలో రాత్రి పూట ఎలాంటి అలజడులు లేకుండా చూసే బాధ్యత పోలీసులపై ఉందన్నారు. విధుల్లో నిర్లక్ష్యం లేకుండా పని చేయాలని ఎస్పీ మేరీ ప్రశాంతి సిబ్బందిని ఆదేశించారు.

ఆంబోతు వీరంగం... వృద్ధుడి మృతి

విశాలాంధ్ర-పోడూరు: పోడూరు మండలం మట్టపర్రులో ఆదివారం ఒక ఆంబోతు చేసిన వీరం గంతో గ్రామస్తులు హడలి పోయారు. పక్క గ్రామానికి చెం దిన ఒక ఆంబోతు కొద్దిరోజులుగా మట్ట పర్రులో సంచరిస్తోంది. కాగా రాత్రి నుంచి ఆంబోతు విపరీత చేష్టలు చేయడంతో ప్రజలు భయాందోళనలు చెందారు. కాగా తెల్ల వారుజామున స్థానిక చినపాలెం గ్రామానికి చెందిన పెచ్చెట్టి శ్రీరామమూర్తి (76) అనే వృద్ధుడు కాలకృత్యాలు తీర్చుకునేందుకు రహదారిపై నడిచి వెళుతుండగా ఆంబోతు ఒక్కసారి అతన్ని కొమ్ములతో పొడిచి ఎత్తి పడేసింది. దీనితో ఆ వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తులు కేకలు వేయడంతో ఆంబోతు పెనుమదం గ్రామంలోకి వెళ్లిపోయింది. సమాచారం అందుకున్న పోలీసు, రెవెన్యూ, ఫైర్ స్టేషన్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ఆంబోతును బంధించేందుకు తీవ్ర ప్రయత్నం చేశారు. ఎట్టకేలకు అయిదు గంటల శ్రమ అనంతరం ఆంబోతును బంధించారు. మృతుడు శ్రీరామ్మూర్తి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వం తరలించారు.

నేడు పెట్రోలు బంక్ ప్రారంభం

విశాలాంధ్ర ద్వారకా తిరుమల: ద్వారకా తిరుమల శ్రీవేంకటేశ్వర విశాల సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ సోమవారం స్థానిక ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రారంభించనున్నారు. 1989లో ప్రారంభించిన ఈ పెట్రోల్‌బంక్ మండల ప్రజలకు నాణ్యమైన పెట్రోల్, డీజిల్‌ను అందించడంలో మొదటి స్థానంలో ఉంది. అయితే ఈ బంకు కేవలం సంఘ సభ్యులకు మాత్రమే వినియోగంలో ఉండేది. దీన్ని ప్రస్తుతం అవుట్ లెట్ బంక్‌గా మార్పుచేసి కోటిరూపాయలకు పైగా నిధులు వెచ్చించి అధునాతన టెక్నాలజీ ప్రవేశపెట్టనున్నారు.

'పెట్టుబడి' గ్రంథ పరిచయ తరగతులకు ఆహ్వానం

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: కారల్ మార్క్స్ రచించిన 'పెట్టుబడి' గ్రంథ పరిచయ తరగతులు మంగళవారం నుంచి ప్రారంభిస్తున్నామని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డీ సోమసుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. సిపాయిపేట భవననిర్మాణ కార్మికసంఘం కార్యాలయంలో గ్రంథ సులభ పరిచయ తరగతులు ప్రారంభం అవుతాయని, వారానికి ఒకగంట చొప్పున ఆరు నుంచి పదివారాలపాటు తరగతులు జరుగుతాయని వివరించారు. ఏఐటీయూసీ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ప్రతీ మంగళవారం నిర్వహిస్తున్న లేబర్ స్కూల్ తరగతుల్లో భాగంగా "దాస్ కాపిటల్" గ్రంథాన్ని సులభ పరిచయం చేసే తరగతులు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. విద్యార్థులు, పోటీ పరీక్షలకు హాజరయ్యే యువత సహా ఆసక్తికలిగిన ఎవరైనా హాజరు కావచ్చునని, ప్రవేశం ఉచితమేనన్నారు.

మెగాఫ్యాన్స్ ఆర్థికసాయం

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: తారక రామ నగర్ కు చెందిన నంగన లవరాజు అనే వ్యక్తికి ప్రమాదం జరిగి మంచాన పడి అతని కుటుంబం ఇబ్బంది పడుతుంది అని తెలుసుకున్న కొయ్యలగూడెం మెగా ఫాన్స్ తమ వంతు సహాయంగా రూ.9400 అతని భార్యకు అందించారు. మెగా ఫాన్స్ అధ్యక్షుడు మేడిన కన్నయ్య, నక్క బాబీ, చెప్పుల మధు పాల్గొన్నారు.

వ్యక్తులపై కేసు

విశాలాంధ్ర-టీ నరసాపురం: బాల్య వివాహం జరిపించిన వ్యక్తుల పై కేసు నమోదు చేసి నట్లుగా ఎస్ ఐ కె సతీష్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం టీ నరసాపురం గ్రామానికి చెందిన మైనర్ బాలిక (14సంవత్సరాలు) కు ఆమె తల్లిదండ్రులు, కొందరు పెద్దలు, ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలానికి చెందిన రాచగిరి చంటిబాబు(19) అనే అతనితో బాల్య వివాహం చేసినట్లుగా టీ నరసాపురం మండల తహశీల్దార్ జె వి సుబ్బారావు ఫిర్యాదు మేరకు మైనర్ బాలిక తల్లిదండ్రులు బాల్య వివాహం చేసుకున్న అబ్బాయి అతని తల్లిదండ్రులతో పాటు వివాహం జరిపించిన పెద్దలపైఆదివారం కేసు నమోదు చేసి నట్లుగా ఆయన తెలిపారు.

క్రీడలతో పాటు చదువూ అవసరమే

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: యువత క్రీడలతోపాటు చదువులలో కూడా మంచి ఉత్తీర్ణత సాధించాలని తెలుగుదేశం పార్టీ పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలో గవరవరం, చొప్పరమన్న గూడెం, గ్రామాలలో ఆదివారం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు గన్నిన సురేంద్రనాథ్ చౌదరి సహకారంతో యువతకు ఏర్పాటుచేసిన వాలీబాల్ కిట్లను శ్రీనివాసరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. టీడీపీ నేతలు యాగంటి హరిబాబు , బొబ్బర చిన్నరాజు, నల్లూరి గోపికృష్ణ, ఉప్పాటి వెంకట్రావు, నాయుడు లీలాకాంత్, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

10న ఏఐటీయూసీ జిల్లా కన్వీనింగ్ కమిటీ సమావేశం

విశాలాంధ్ర-ఏలూరు: ఈనెల 10న ఏలూరులో సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కన్వీనింగ్ కమిటీ సమావేశం జరుగుతుందని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ప్రథమ మహాసభ జూన్ 10, 11 తేదీల్లో ఏలూరులో జరపాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్ణయించిందన్నారు. జిల్లా మహాసభ నిర్వహణ, పట్టణ, మండల మహాసభలు ఏఐటీయూసీ అనుబంధ సంఘాల జిల్లా మహాసభలు నిర్వహణ తదితర అంశాలపై సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. సభ్యులు సకాలంలో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

10న విజయవాడలో వీఆర్ఏల ధర్నా

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్రవ్యాప్తంగా సమయపాలనలేకుండా రెవెన్యూ పరిధిలో పనిచేస్తున్న వీఆర్ఏల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్న కారణంగా ఈనెల 10వ తేదీన విజయవాడలోని అలంకార్ సెంటర్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వీఆర్ఏలు ధర్నా నిర్వహిస్తున్నామని సంఘ జిల్లా అధ్యక్షుడు బుంగా గణేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్ఏల సమావేశం మండల అధ్యక్షుడు గుమ్మళ్ళ వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. వీఆర్ఏల సంఘం నాయకుడు మాకపాటి నరసయ్య, ఎవి తాతారావు, వి.లక్ష్మీ శ్రీదేవి, మస్తాన్ బీబీ. నరసింహమూర్తి, విఆర్ఎ లు పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి వర్ధంతి

విశాలాంధ్ర-తణుకు: అల్లూరి సీతారామ రాజు 99వ వర్ధంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని వీరనారాయణ థియేటర్ కూడలిలో ఉన్న అల్లూరి విగ్రహానికి ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి టీ అప్పలస్వామి, పట్టణ కార్యదర్శి బొద్దాని నాగ రాజు పూలమాలు వేసి నివాళులు అర్పించారు. సీపీఐ నేతలు గుబ్బల వెంకటే శ్వరరావు, నూనె రాధాకృష్ణ, ఏఐఎస్ఎఫ్ నేతలు ధనరాజు, అచ్చిబాబు పాల్గొన్నారు.

ఆర్బీకేలో కలెక్టర్ తనిఖీలు

విశాలాంధ్ర-పెనుమంట్ర: మండలంలో మార్టేరులో రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టరు ఆదివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. రిజిస్టర్లు, తేమ శాతం చూసే యంత్రాన్ని, స్టాకును తది తర వాటిని జిల్లా కలెక్టరు నిశితంగా పరిశీలించారు. ఈ ఆర్బీకేలో ఇంతవరకూ ఎంతమంది రైతులు వచ్చారు, ఎంత ధాన్యం కొనుగోలు చేశారని అధికారులను జిల్లా కలెక్టరు అడగగా,150 మంది రైతులు వచ్చారని, 1032 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేశామని, 130 మంది రైతులు సుమారు 260 ఏకరాలు వరి కోతలు కోయాల్సి ఉందని జిల్లా కలెక్టరుకు అధికారులు వివరించారు. కలెక్టరు వెంట ప్రత్యేక అధికారి జిల్లా ఆర్ డ బ్ల్యు యస్ అధికారి రామస్వామి, తహశీల్దారు డి.అశోక్ వర్మ,యం పి డి వో వి.పూర్ణ బాబ్జీ, వ్యవసాయ శాఖ అధికారిని ఏ. జ్యోషులా , రైతులు,రెవిన్యూ,ఆర్ బి కె సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.

చెరువు మట్టిని దోచేస్తున్నారు

విశాలాంధ్ర-లింగపాలెం: ఇటుకల తయారీదారులు అక్రమంగా చెరువు మట్టిని దోచేస్తున్న సంఘటన చర్చనీయాంశంగా మారింది. ఇళ్ళకు, వివిధ నిర్మాణాలకు వినియోగించే ఇటుకలకు ప్రస్తుతం డిమాండ్ అధికంగా ఉంది. ఇటుకలు తయారు చేయటానికి నాణ్యమైన మట్టిని ప్రధానంగా వినియోగించాలి. ఇటుకల తయారీ తరువాత వీటిని కాల్చటానికి కట్టెలు, ఊక, బొగ్గును వినియోగిస్తారు. వీటిని కొనుగోలు చేస్తారు. పచ్చి ఇటుకకు మట్టిని వినియోగిస్తారు. ఈ మట్టి నాణ్యతగా, జిగురుగా ఉండాలి. ఒకప్పుడు ఇటువంటి నాణ్యమైన మట్టిని వినియోగించేవారు. ఇప్పుడు ఏదొక మట్టిని వినియోగించటంపై ఇటుక తయారీ నాణ్యతా ప్రమాణాలపై అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇటుకలు తయారీకి కావాల్సిన మట్టిని సేకరించటానికి అధికారుల అనుమతులు తీసుకోవాలి. ప్రధానంగా చెరువు మట్టిని తేవాలంటే ఇరిగేషన్ శాఖాధికారుల అనుమతులు పొందాలి. ఇటుక తయారీదారులు చాలా మంది అనుమతులు తీసుకోవటంలేదనే విమర్శలు ఉన్నాయి. ఇటుకలు తయారీదారులంతా చెరువుల సమీపంలో బట్టీ ఏర్పాటు చేసుకుంటారు. వీరు కావాల్సిన సమయాలలో చెరువు మట్టిని దోచేస్తున్నారని పలువురిపై ఆరోపణలు ఉన్నాయి. వారం, పది రోజుల్లో ఇటుక తయారవుతుంది. వెయ్యి ఇటుకలను రూ. 7 వేలు నుంచి రూ. 8 వేలకు విక్రయిస్తుంటారు. మట్టిని తోలుకోవటానికి క్యూబిక్ మీటరుకు రూ. 60లు చెల్లిస్తే వెయ్యి ఇటుకల తయారీకి మట్టి సరిపోతుంది. రూ. 60లు చెల్లించలేక అక్రమంగా చెరువుల మట్టిని దోచేయటం తీవ్ర చర్చనీయాంశమైంది. చెరువు తవ్వకాల వల్ల చెరువులు ప్రమాదంగా మారుతున్నాయని ప్రజలు అంటున్నారు. జగనన్న ఇళ్ళ నిర్మాణాలు జరుగుతుండటంతో ఇటుకలకు డిమాండ్ అధికంగా ఉంది. డిమాండ్‌కు తగ్గట్టుగా తయారీకి మట్టిని దోచేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటుక తయారీదారులు చెరువు మట్టిని దోచేయటంపై ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందిస్తున్నారు. మట్టిని దోచేయటం వాస్తవమేనని వీరు అంటున్నారు. లింగపాలెం, చింతలపూడి మండలాల్లో ఇటుకల తయారీదారులు అనేక మంది మట్టిని దొంగిలిస్తున్నారని, దీనిపై దాడులు చేస్తామని ఇరిగేషన్ అధికారులు అంటున్నారు. ఇటుకలకు నాణ్యమైన మట్టిని వినియోగించాలి. కాని అలాకాకుండా ఇష్టానుసారంగా వివిధ రకాల మట్టిని వినియోగిస్తున్నారని, ఇలాంటి ఇటుకలు నాణ్యతగా ఉండవని ప్రజలు అంటున్నారు. దీనిపై అధికారులు దృష్టి పెట్టి నాణ్యతా ప్రమాణాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.